నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, మంగళవారం 11 మార్చి 2025 | VIKARABAD

# మా సంగతి ఏమిటీ..?

- కొనసాగుతున్న రూ.వెయ్యి చెల్లించి దరఖాస్తు చేసుకున్న వారి ప్లాట్ల రెగ్యులరైజేషన్
- రూ.10,000 చెల్లించిన వారి ప్లాట్ల ఎల్ఆర్ఎస్‌పై స్పష్టత కరువు
- పరిగి మున్సిపాలిటీలో 2019లో డబ్బులు చెల్లించిన దరఖాస్తుదారులు 1,250 మంది
- తమకూ న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి



పరిగి, మార్చి 10 : లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్) కింద దరఖాస్తు చేసుకున్న వారిలో రూ.10,000 చెల్లించిన వారు పరేషాన్‌లో ఉన్నారు. డీటీసీపీ ఆమోదించిన లేఅవుట్లు కాకుండా గ్రామపంచాయతీ ఆమోదించిన, ఆమోదించని లే అవుట్లలోని ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకునేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ పథకాన్ని తీసుకొచ్చింది. ఇందులో భాగంగానే 2019లో ఎల్ఆర్ఎస్ కింద దరఖాస్తు చేసుకుంటే క్రమబద్ధీకరిస్తామని ప్రకటించింది. ఈ పథకం కింద ఎల్ఆర్ఎస్ 2019 వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను స్వీకరించింది. ప్రతి దరఖాస్తుదారుడు రూ.10,000 చెల్లించాలని సూచించింది. దరఖాస్తు ఫీజు అధికంగా ఉండడంతో అప్పట్లో తక్కువ మొత్తంలోనే దరఖాస్తులు వచ్చాయి. పరిగి మున్సిపాలిటీ నుంచి 1,250 దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. అప్లికేషన్లు తక్కువగా రావడంతో ప్రభుత్వం ఆ ఫీజును రూ. వెయ్యిగా నిర్ణయించగా.. పరిగి మున్సిపాలిటీ పరిధిలో 3,069 దరఖాస్తులు అందినట్లు అధికారులు చెబుతున్నారు. అలాగే లేఅవుట్‌లో రిజిస్ట్రేషన్ చేయగా మిగిలిపోయిన ప్లాట్లకు సంబంధించి లేఅవుట్ క్రమబద్ధీకరణ కోసం 29 దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎలాంటి ఫీజు లేకుండానే ఎల్ఆర్ఎస్ అమలు చేయాలని డిమాండ్ చేసింది.

అయితే, ఇప్పుడు అధికారంలో ఉన్న ఆ పార్టీ రాష్ట్ర ఖజానా నింపుకోవాలనే ఏకైక లక్ష్యంతో దరఖాస్తుదారుల నుంచి ఫీజు వసూలు చేయాలని సంకల్పించింది. ఇందుకు మార్చి 31వ తేదీ లోపు చెల్లిస్తే 25శాతం రాయితీ అని ప్రకటించింది. కాగా, ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు పూర్తి స్థాయి చెల్లింపుల కోసం అధికారులను సంప్రదిస్తున్నారు. పరిగిలో ఇప్పటివరకు 60 మంది వరకు చెల్లించినట్లు సమాచారం. లే అవుట్ రెగ్యులరైజేషన్‌లో భాగంగా ఎనిమిది లే అవుట్లు ఆన్‌లైన్ పూర్తైనట్లు అధికారులు పేర్కొంటున్నారు.

ఎల్ఆర్ఎస్ కింద ప్లాట్ల రెగ్యులరైజేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ స్వయంగా సిబ్బంది ఫోన్లు చేసి మరీ వెంటనే ఎల్ఆర్ఎస్ డబ్బులు చెల్లించాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. రూ. వెయ్యి ఫీజుగా చెల్లించి దరఖాస్తు చేసుకున్న వారి ప్లాట్ల క్రమబద్ధీకరణ ప్రక్రియ కొనసాగుతుండగా రూ.10 వేలు చెల్లించిన వారి ప్లాట్ల ఎల్ఆర్ఎస్ పై ఇప్పటివరకు ఎలాం టి స్పష్టత లేకపోవడం గమనార్హం.

## మా ప్లాట్లనూ క్రమబద్ధీకరించండి..

2019లో దరఖాస్తులు స్వీకరించిన తర్వాత ఆ సైట్ క్లోజ్ అయిందని, మిగతా వివరాలు తమకు తెలియవని, ఉన్నతాధికారుల నుంచి తమకు ఎలాంటి సమాచారం లేదని స్థానిక అధికారులు పేర్కొంటున్నారు. ఈ అంశంపై పలువురు దరఖాస్తుదారులు అధికారులను కలిసినా ఫలితం లేదు.

దీంతో రూ.10,000 చెల్లించి దరఖాస్తు చేసుకున్న వారు పరేషాన్‌లో ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ అంశంపై తగిన చర్యలు తీసుకొని 2019లో రూ.10 వేలు చెల్లించిన వారి ప్లాట్లను క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు.

### రూ. 10వేలు చెల్లించి దరఖాస్తు చేశా



ప్లాటు రెగ్యులరైజేషన్ కోసం 2019 లో రూ.10 వేలు చెల్లించి దరఖాస్తు చేసుకున్నా. ఇటీవల ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ పథకం కింద ప్లాట్ల క్రమబద్ధీకరణ ప్రక్రియను ప్రారంభించగా రూ. వెయ్యి చెల్లించిన వారి ప్లాట్ల రెగ్యులరైజేషన్ ప్రక్రియ కొనసాగుతున్నది. రూ. 10 వేలు చెల్లించిన వారి ప్లాట్ల రెగ్యులరైజేషన్ మాత్రం జరుగడం లేదు. ఈ విషయమై అధికారులను సంప్రదిస్తే సరైన సమాధానం ఇవ్వడంలేదు. ప్రభుత్వం ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకొని తన ప్లాట్‌ను క్రమబద్ధీకరించాలి.

-ఎం.సతీశ్‌కుమార్, పరిగి

## రైతులకు భరోసా ఇంకెప్పుడూ..?



తాండూరు, మార్చి 10 : వానకాలం గడిచిపోయింది. యాసంగి ప్రారంభమై మూడు నెలలు దాటిపోతున్నా రైతులకు ఇంకా రైతుభరోసా పెట్టుబడి సాయమే అందలేదు. రాష్ట్రంలో రైతుల బాధలు తీరాలంటే ఒక్క కేసీఆర్‌తో సాధ్యం. రైతుల బాధలు తెలిసిన ఒకే ఒక పార్టీ బీఆర్ఎస్. కాంగ్రెస్ పాలనలో సీఎం రేవంత్‌రెడ్డి నెరవేరని హామీలిస్తూ ప్రజలను మోసం చేస్తున్నాడు.

పంటల సాగు కోసం గతంలో కేసీఆర్ రైతుబంధు ఇచ్చిన విధంగా ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి రైతు భరోసా పేరుతో ఎకరానికి రూ.6 వేల చొప్పున ఏడాదికి రెండు సార్లు రూ.12 వేలు ఇస్తామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి దాదాపుగా 15 నెలలు దాటినా ఆ మాటను నిలబెట్టుకోలేకపోయాడు. కేసీఆర్ ఇచ్చిన రైతుబంధుతో వ్యవసాయం పండుగల చేసుకున్నాం. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందక చాలా ఇబ్బందిగా మారింది. ఎరువుల ధరలు పెరుగడంతోపాటు సమయానికి దొరకడం లేదు. కరెంటు కూడా సక్రమంగా ఉండకపోవ డంతో నీళ్ల పంటలు వేయాలంటే భయంగా ఉన్నది. దేవుళ్లపై ఒట్టేసిన రేవంత్‌రెడ్డి ఝూటా మాటలతో రాష్ట్రం కరువుగా మారుతున్నది. రైతుల పంట రుణాలను కూడా సక్రమంగా పూర్తి చేయలేదు. 35 శాతం కూడా మాఫీ కాలేదు. రైతులకు కాంగ్రెస్ పాలన శాపంగా మారింది. ఈ పాలనలో తీవ్రమైన కష్టాలను చూస్తున్నాం. మళ్లీ కేసీఆర్ పాలన వస్తేనే రైతుల కుటుంబాల్లో వెలుగులు వస్తాయి.

-రాంపూర్ రాములు, రైతు, జుంటుపల్లి గ్రామం, యాలాల మండలం

కేసీఆర్ ప్రభుత్వం పదేండ్ల పాటు వ్యవసాయం, పరిశ్రమలు, గృహ వినియోగానికి నిరంతర విద్యుత్తును సరఫరా చేసింది. దీంతో అన్నదాతలు పంటలను సాగు చేసుకుని సంతోషంగా జీవించారు. పరిశ్రమలు పవర్ హాలిడేలు లేకుండా కొనసాగాయి. కానీ.. ఏడాది కిందట కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మళ్లీ కరెంట్ కోతలు షురూ అయ్యాయి. ఎండాకాలం ప్రారంభం కావడం.. భూగర్భ జలాలు అడుగంటడంతో అనధికార కోతలతో పంటలు ఎండుతున్నాయని.. అదేవిధంగా గృహాలతోపాటు వ్యవసాయానికి విద్యుత్తు వినియోగం పెరిగి ట్రాన్స్‌ఫార్మర్లపై అదనపు భారం పడి లోవోల్టేజీ సమస్యతో తరచూ మోటర్లు కాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను మరమ్మతులు చేయించే లోపే పంట పొలాలు ఎండిపోతున్నాయని.. అందువల్ల విద్యుత్తు సరఫరాలో కోతల్లేకుండా సరఫరా చేయాలని కోరుతున్నారు. కాగా వికారాబాద్ జిల్లాలో వ్యవసాయం, గృహ వినియోగం, పరిశ్రమలకు రోజుకు ప్రస్తుతం 7.2 మిలియన్ యూనిట్ల విద్యుత్తు వినియోగమవుతుండగా, జిల్లాలో 75,193 లక్షల వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి.

### సరఫరాలో కోతల్లేకుండా చూడాలి



యాసంగిలో సాగు చేసిన వరి పంట చివరి దశలో ఉన్నందున ప్రభుత్వం విద్యుత్తు కోతలు లేకుండా చూడాలి. భూగర్భ జలాలు తగ్గడంతో బోరు బావుల్లోనూ నీరు తగ్గిపోయింది. ఉన్న నీటితో పంటను కాపాడుకునేందుకు బోరుమోటర్లను నిరంతరాయంగా నడిపించాల్సి ఉంటుంది. అందువల్ల విద్యుత్తు సరఫరాలో కోతలుండొద్దు.


-మల్లేశ్‌గౌడ్ రైతు తుంకిమెట్ల, బొంరాస్‌పేట

### ఉదయం, సాయంత్రం కరెంటు పోతున్నది



ఉదయం, సాయంత్రం సమయాల్లో గంట సేపు చొప్పున ప్రతిరోజూ కరెంట్ సరఫరాను నిలిపేస్తున్నారు. దీంతో చాలా ఇబ్బందిపడుతున్నాం. కరెంటు కోతలుండవని ఓ వైపు ప్రభుత్వం, అధికారులు చెబుతున్నా కోతలు మాత్రం తప్పడం లేదు. ఎండాకాలం ప్రారంభమైన నేపథ్యంలో అధికారులు స్పందించి అనధికార కోతలు విధించొద్దు

-రామాచారి, రంగారెడ్డి



# కోతల కాంగ్రెస్

## నాడు నిరంతరం.. నేడు అయోమయం

నాటి అస్తవ్యస్త కాంగ్రెస్ పాలనను గుర్తు చేసుకుంటున్న రైతులు

- కోతలతో నీరందక పంటలు ఎండిపోతున్నాయని అన్నదాతల ఆవేదన
- పరిశ్రమలు, గృహ వినియోగానికీ పవర్ కట్స్
- కేసీఆర్ హయాంలో వ్యవసాయం, పరిశ్రమలు, గృహ వినియోగానికి నిరంతర విద్యుత్తు సరఫరా
- వికారాబాద్ జిల్లాలో ప్రస్తుతం రోజుకు 7.2 మిలియన్ యూనిట్ల విద్యుత్తు వినియోగం

**ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పెరిగిన కరెంట్ కోతలు**
**కష్టాల్లో రైతులు, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు**

వికారాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ): కరెంట్ కోతలు మళ్లీ షురూ అయ్యాయి. కాంగ్రెస్ పార్టీ వస్తే విద్యుత్తు కష్టాలు మళ్లీ మొదటికొస్తాయని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పిన విధంగానే రేవంత్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే పవర్ కష్టాలు మొదలయ్యాయి. ఎండల తీవ్రత పెరుగుతుండడంతో అనధికారిక కోతలు కొనసాగుతున్నాయి. గృహాలతోపాటు వ్యవసాయ రంగానికి వినియోగం పెరగడంతో ట్రాన్స్‌ఫార్మర్లపై అదనపు భారం పడి లోవోల్టేజీ సమస్య ఏర్పడుతున్నది. దాంతో తరచూ మోటర్లు కాలిపోవటంతోపాటు మీటర్లు, స్టార్టర్లల్లోనూ సాంకేతిక సమస్య తలెత్తున్నది. రంగారెడ్డి జిల్లాలోని మంచాల, యాచారం, మాడ్గుల, తలకొండపల్లి, కొందుర్గు, చౌదరిగూడ, తదితర మండలాల్లో లోవోల్టేజీ సమస్య తీవ్రంగా ఉండడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను మరమ్మతులు చేయించేలోపే పంటపొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కేసీఆర్ హయాంలో.. పదేండ్లపాటు వ్యవసాయానికి 24 గంటల నిరంతర విద్యుత్తు సరఫరా అయితే.. రేవంత్ సర్కార్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అన్నదాతలకు కష్టాలు మొదలయ్యాయి. ప్రస్తుతం అధికారికంగా నాలుగున్నర గంటలపాటు త్రీఫేస్ సరఫరాలో కోతలు విధిస్తుండగా.. అనధికారికంగా ఓవర్ లోడ్ పేరిట ఎప్పుడు పడితే అప్పుడు నిలిపివేస్తున్నారు. ఓ వైపు బోర్లు, బావుల్లో అడుగంటుతున్న భూగర్భజలాలకు తోడు కరెంట్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యాసంగిలో సాగు చేసిన వరి తదితర పంటలకు ఉన్న నీటిని కూడా అందించలేకపోతున్నారు. కరెంట్ కోతలతో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనను జిల్లా రైతాంగం గుర్తు చేసుకుంటున్నది. నాడు అర్ధరాత్రి 2-3 గంటల సమయంలో పంటలకు నీరు పెట్టేందుకు వెళ్లిన రైతులు ఎంతో మంది విద్యుదాఘాతంతో మృత్యువాత పడడంతోపాటు చాలామంది రైతులు పంట పొలాలకు నీరు పెట్టేందుకు మోటర్లు ఆన్ చేయబోయి మృతిచెందారు. కరెంట్ ఎప్పుడొస్తదా..? అని రైతులు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేది. కేసీఆర్ హయాంలో నిరంతర విద్యుత్తు సరఫరాతో పరిశ్రమలను నెలకొల్పేందుకు పలువురు క్యూ కడితే...ప్రస్తుతం విద్యుత్తు కోతలతో పరిశ్రమలు పవర్ హాలిడేలు ప్రకటించే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం పరిశ్రమలు, గృహ వినియోగానికి సంబంధించి కూడా విద్యుత్తు కోతలు పెరిగాయి. గృహ వినియోగానికి సంబంధించి పట్టణాలు, గ్రామాల్లో రోజుకు 10-15 సార్లు అనధికార కోతలు విధిస్తున్నారు. మరోవైపు వికారాబాద్ జిల్లాలో వ్యవసాయంతోపాటు గృహ వినియోగం, పరిశ్రమలకు రోజుకు ప్రస్తుతం 7.2 మిలియన్ యూనిట్ల విద్యుత్తు వినియోగమవుతుండగా.. జిల్లాలో 75,193 లక్షల వ్యవసాయ కనెక్షన్లున్నాయి.

అదేవిధంగా రంగారెడ్డి జిల్లాలో సుమారు 50,000 పైగా ట్రాన్స్‌ఫార్మర్లున్నాయి. వాటిలో వ్యవసాయం, చిన్నతరహా పరిశ్రమలు, రైస్‌మిల్లులు, కట్టెమిషన్లు, అపార్ట్‌మెంట్లు తదితర వాటికి ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్లున్నాయి. ఎండలు పెరుగుతుండడంతో విద్యుత్తు వినియోగం కూడా పెరిగి ట్రాన్స్‌ఫార్మర్లపై అదనపు భారం పడి సరఫరా చేయలేక అవి కాలిపోతున్నాయి.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యుత్తు రంగంలో విప్లవాత్మక మార్పు తీసుకొచ్చింది. పదేండ్లపాటు వ్యవసాయం, పరిశ్రమలు, గృహ వినియోగానికి నిరంతర విద్యుత్తును సరఫరా చేసింది. నాడు కరెంట్ వస్తే వార్త.. నేడు కరెంట్ పోతే వార్త అనే విధంగా కనీవినీ ఎరుగని మార్పును తీసుకొచ్చింది.



రంగారెడ్డి జిల్లాలోని ఓ విద్యుత్తు కార్యాలయానికి మరమ్మతుల కోసం వచ్చిన ట్రాన్స్‌ఫార్మర్లు

### పంటను కాపాడుకునేందుకు అవస్థలు పడుతున్నాం



బోరు బావుల్లో నీళ్లు తగ్గడంతో వరి పంటను కాపాడుకునేందుకు తీవ్ర కష్టాలు పడుతున్నారు. చెరువులు, దూర ప్రాంతాల నుంచి నీటిని ట్యాంకర్లు తదితర వాటి ద్వారా తీసుకొచ్చి పంటకు అందిస్తున్నాం.

-మడిగే శ్రీనివాస్
రైతు కుదురుమళ్ళ దుద్యాల

# పొలాల్లో కడీలు.. రైతుల కన్నీళ్లు

- సర్వేను అడ్డుకున్నా భయపెట్టి పొలాల్లో కడీలు పాతిన అధికారులు
- కలెక్టరేట్‌లోకి అనుమతించకపోవడంతో రైతు ఆత్మహత్యాయత్నం
- భూమికి భూమి..లేదా పరిహారం చెల్లించాలని రైతుల డిమాండ్



రైతుల పంట పొలాల్లో గ్రీన్ ఫీల్డ్ రోడ్డు ఏర్పాటుకు అధికారులు పాతిన హద్దురాయి

రంగారెడ్డి, మార్చి 10 (నమస్తే తెలంగాణ) : ఫ్యూచర్ సిటీ కోసం ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఏర్పాటుతో నష్టపోనున్న భూబాధితుల్లో రోజురోజుకూ నిరసన జ్వాలలు పెరుగుతున్నాయి. ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తుండడంతోపాటు పరిహారం విషయాన్ని తేల్చకుండానే భూముల్లో సర్వే చేసి హద్దురాళ్లను ఏర్పాటు చేస్తుండడంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కందుకూరు మండలంలోని మీర్‌ఖాన్‌పేట సమీపంలో నిర్మిస్తున్న ఫ్యూచర్‌సిటీ కోసం ప్రభుత్వం ఓఆర్ఆర్ నుంచి ట్రిపుల్‌ఆర్ వరకు రోడ్డును నిర్మించాలని నిర్ణయించింది. ఓఆర్ఆర్ కొంగరకలాన్ నుంచి కొంగరకలాన్, రావిర్యాల, ఫిరోజ్‌గూడ నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు 18 కిలోమీటర్లకు 440 ఎకరాలు, 300 ఫీట్ల రోడ్డును వేస్తున్నారు. అలాగే, మీర్‌ఖాన్‌పేట్ నుంచి ఆకుతోటపల్లి వరకు 22 కిలోమీటర్ల రోడ్డును ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సుమారు వెయ్యి ఎకరాలను సేకరించాలని అధికారులు నిర్ణయించగా.. 4,725 మంది రైతులు భూములను కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### భూమికి భూమి ఇవ్వాలి : రైతులు..

ప్రభుత్వం గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు కోసం సేకరిస్తున్న భూమికి బదులు తయకు మరో చోట భూమిని ఇవ్వాలని.. లేకుంటే భూములకున్న విలువ ప్రకారం పరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. లేని ఎడల ఎట్టిపరిస్థితుల్లోనూ తమ భూములను ఇచ్చే ప్రసక్తే లేదని.. అవసరమైతే ప్రాణాత్యాగానికైనా సిద్ధమని తేల్చి చెబుతున్నారు. సర్వే ప్రారంభించిన రోజే కొంగరకలాన్‌లో రైతులు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేయగా.. పరిస్థితిని తెలుసుకున్న ప్రభుత్వం పెద్ద ఎత్తున పోలీసులను మోహరించి సర్వే నిర్వహించింది. సర్వే కంటే ముందు రాత్రి సమయంలో డ్రోన్ కెమెరాలతో రోడ్డు సర్వే చేపట్టింది. సర్వేను అడ్డుకుంటున్న రైతులకు సరైన పరిహారం చెల్లించిన తర్వాతే.. సర్వే చేసి హద్దురాళ్లను ఏర్పాటు చేస్తామని చెప్పి.. ఆ విషయాన్ని తేల్చకుండానే సోమవారం నుంచి హద్దురాళ్లు పాతే కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. కలెక్టరేట్ సమీపం నుంచి రావిర్యాల భూముల్లో హద్దురాళ్లు ఏర్పాటు చేస్తుండగా.. విషయం తెలుసుకున్న రైతులు అక్కడికెళ్లి అధికారులను అడ్డుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకే హద్దురాళ్లను ఏర్పాటు చేస్తున్నామని అధికారులు చెప్పి.. అక్కడి నుంచి రైతులను పంపించేశారు. దీంతో ఆందోళన చెందిన రైతులు కలెక్టర్‌ను కలిసేందుకు వెళ్తుండగా అక్కడి సిబ్బంది అడ్డుకోవడంతో.. ఓ రైతు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేయగా.. పోలీసులు అడ్డుకుని అక్కడి నుంచి తిరిగి వెనక్కి పంపించారు.

### పరిహారాన్ని తేల్చాలి..

తమ భూములపై పరిహారం విషయాన్ని ప్రభుత్వం తేల్చకుంటే ఆత్మహత్యలు చేసుకుంటామని రైతులు హెచ్చరిస్తున్నారు. ఉన్న కొద్దిపాటి భూములను లాక్కుని తమను రోడ్డు పాలు చేయొద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే కొంగరకలాన్‌కు చెందిన రైతులు ప్రభుత్వ తీరుకు నిరసనగా ఆత్మహత్యాయత్నం చేయగా.. అలాగే, రావిర్యాల గ్రామానికి చెందిన రైతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆత్మహత్యాయత్నం చేశాడు. తమ భూములకు మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని, లేదా, భూమికి భూమి ఇప్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ రెండింటిలో దేనికి ప్రభుత్వం అంగీకరించకపోతే ఆత్మహత్యలు చేసుకుంటామని హెచ్చరిస్తున్నారు.




కలెక్టరేట్ ఎదుట పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేస్తున్న గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు భూబాధిత రైతు బాలరాజు.. అడ్డుకుంటున్న పోలీసులు

## గాంధీలో మురుగు పరుగు

సిటీ బ్యూరో/బన్సీలాల్‌పేట (నమస్తే తెలంగాణ): గాంధీ జనరల్ దవాఖాన సమస్యలతో సతమతమవుతున్నది. ఆస్పత్రి ప్రాంగణంలో మురుగునీరు ప్రవహిస్తుంటే.. పై అంతస్తులకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన లిఫ్ట్‌లు పనిచేయడం లేదు.. దీంతో రోగులు , వారి సహాయకులు ఇబ్బందిపడుతున్నారు. ఇటీవలే వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గాంధీలో పర్యటించినా తీరు మారకపోవడం గమనార్హం.

### బాగు చేయించడం మరిచారు..

ఆస్పత్రికి ప్రతి సోమవారం సుమారు 2000 మంది ఔట్ పేషెంట్లు రాగా, మిగతా రోజుల్లో 1500 వరకు వస్తుంటారు. అదేవిధంగా 1200 బెడ్ల సామర్థ్యం గల ఈ దవాఖాన స్థాయికి మించి ఇన్ పేషంట్లు వచ్చి చికిత్స పొందుతుంటారు. ఇదిలా ఉండగా రెండో అంతస్తులో ఉన్న చర్మ, లైంగిక వ్యాధుల ఓపీ విభాగానికి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన లిఫ్ట్ కొన్నిరోజులుగా పనిచేయడం లేదు. మొదటి అంతస్తులో ఉన్న పలు ఇనుప కుర్చీలు విరిగిపోయాయి. మరోవైపు దవాఖాన నుంచి వచ్చే మురుగు పొంగి బయటికి రావడంతో రోగులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.